ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 318 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 24 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## యాదాద్రి ఆలయ స్వర్ణ విమాన గోపురాన్ని
# ఆవిష్కరించిన సీఎం రేవంత్





**ప్రపంచ అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో ఏ దేవాలయంలో లేని విధంగా ఆలయ విమానం గోపురం స్వర్ణమయమైంది. బంగారు తొడుగులతో స్వామివారి ప్రతిమ దేదీప్యమానంగా వెలుగుతూ ఆకర్షణీయంగా కనువిందు చేస్తోంది. దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణగోపురంగా రికార్డు సృష్టించింది.**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచి పోయేలా పునర్నిర్మాణం చేపట్టారు. ఆలయ ఉద్ఘాటన తర్వాత లక్ష్మీ నరసింహస్వామి దివ్య విమాన గోపురాన్ని125 కిలోల స్వచ్ఛమైన బంగారంతో తాపడం చేయాలని నిర్ణయించారు. ఆలయ హుండీ కానుకలు, భక్తుల దాతలతో వచ్చిన 68.84 కిలోల బంగారంతో ప్రధానాలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం చేయించారు.యాదగిరిగుట్ట ఆలయంలో బంగారు గోపురాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఆలయంలో జరిగిన దివ్య విమాన స్వర్ణ గోపుర మహా కుంభాభిషేక మహెూత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. మహా పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణకుంభ స్వాగతం పలికి రేవంత్ దంపతులకు వేదపండితులు ఆశ్వీరాదం ఇచ్చారు. ఐదు రోజులుగా స్వర్ణ విమానావిష్కరణ, మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకాలను ఆలయ అర్చకులు వేద పండితులు వైభవంగా నిర్వహించారు.ఆలయ ఉత్తర తిరువీధిలో నారసింహ హెూమం, మహా కుంభాభిషేకంతో పాటు పంచకుండాత్మక యాగం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెూమ గుండాల మధ్యలో స్వామివారిని ఆవాహన చేసి ప్రతిష్టించి 108 మంది రుత్వికులు యజుర్వేదాలు ఆలపించారు. వానమామలై మధుర పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 60మంది రుత్వికులు లక్ష్మి, నరసింహ, సుదర్శన, రామాయణం, భాగవతం, మూల మంత్ర హవనాలు, మూల మంత్ర జపాలతో పాటు ఉదయం సాయంత్రం విష్ణు, నరసింహ, రామాయణం, భాగవత పారాయణాలతో పాటు అభిషేకాలు నిర్వహించారు.

**దివ్య విమాన రాజగోపురం యొక్క విశేషాలు**

ప్రధానాలయ పంచతల విమాన గోపురం ఎత్తు 47 అడుగులతో అతి ఎత్తైన

..మిగతా 2లో



# గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్..

### 38 గంటలుగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్!

శ్రీశైలం, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల వాంఛ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు. ఆరు నియోజకవర్గాల్లో 3 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు.. 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు.. నాలుగు దశాబ్దాల కాలంగా ముందుకు సాగడం లేదు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఫుల్ ఫోకస్ పెట్టింది. దీంతో సుమారు ఐదేళ్ల తర్వాత టన్నెల్ పనులు ఇటీవల తిరిగి ప్రారంభమయ్యాయి. అంతలోనే అనుకోని ప్రమాదం జరిగింది.. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్. బయట నుంచి చూస్తేనే చీకటి గుయ్యారం. ఇక 14 కిలోమీటర్ల లోపలకు వెళితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అక్కడ చిక్కుకుపోతే, బయటకు వచ్చే మార్గం కనిపించకపోతే అసలు ఊహించుకోవడానికి కూడా సాధ్యం కాదు. కాని కొన్ని గంటల నుంచి ఆశకు శ్వాసకు మధ్య ఎనిమిది మంది ఊగిసలాడుతున్నాయి. వాళ్లను క్షేమంగా బయటకు తెచ్చేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నల్గొండ జిల్లాకు నీటిని తరలించే ప్రాంతం పూర్తిగా

..మిగతా 2లో

# కోహ్లీ సెంచరీ- పాకిస్థాన్ చిత్తు




హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. ప్రస్తుత ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు ఇది రెండో విజయం కాగా, పాకిస్థాన్‌కు రెండో ఓటమి. టాస్ గెలుచుకుని తొలుత బ్యాటింగ్ చేసిన పాక్, 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ టార్గెట్‌ను టీమ్‌ఇండియా 42.3 ఓవర్లలో వికెట్లు 4 కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ (100బీ 111 బంతుల్లో 7 ఫోర్లు) బౌండరీ బాది శతకం పూర్తి చేసుకోవడంతో మ్యాచ్‌ను ముగించాడు. శ్రేయస్ అయ్యర్ (56బీ 67 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (46బీ 52 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. రోహిత్ శర్మ (20బీ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్, ఖుల్‌దిష్ షా ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సౌద్ షకీల్ (62 పరుగులు)హాఫ్ సెంచరీ సాధించగా, కెప్టెన్ రిజ్వాన్ (46 పరుగులు) రాణించాడు. చివర్లో కుష్‌దిల్ షా (38 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. భారత్ బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 3, హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ తలో వికెట్ పడగొట్టారు. భారత్ తాజాగా విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కావడం విశేషం. అదే సమయంలో వన్డేల్లో వేగంగా 14 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. 287 ఇన్నింగ్స్‌ల్లో (299 మ్యాచ్‌లు) కోహ్లీ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. తాజా విజయంతో భారత్ సెమీస్ అవకాశాలు మరింత మెరుగవ్వగా, పాక్ దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# కేవలం 40 నిమిషాల్లోనే..

### శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి

#### మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్‌కు సంబంధించిన సర్వే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు కొనసాగుతున్న మెట్రో సర్వే పనులను

..మిగతా 2లో

## ఏఐ రంగంలో దేశం
# మరింత ముందుకెళ్లాలి



### మన్‌కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): కృత్రిమ మేధ వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో ఈ సాంకేతికతను వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ వినియోగం గురించి ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో ఓ ఉపాధ్యాయుడి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. ఇస్రో 100వ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేయడం దేశానికే గర్వకారణం అని మోదీ కొనియాడారు. అంతరిక్షశాస్త్ర సరిహద్దులను అధిగమించాలనే దేశ బలమైన సంకల్పానికి ఇది నిదర్శనమని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో దాదాపు 460 ఉపగ్రహాలను లాంచ్ చేసినట్లు తెలిపిన ఆయన.. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో గర్వకారణం

..మిగతా 2లో



# ఇక కిక్కే కిక్కు..

### తెలంగాణలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. మద్యం బ్రాండ్ల కొత్త విధానానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికోసం రేవంత్ ప్రభుత్వం.. ఆదేశించిన రీతిలో కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. రాష్ట్రంలో రిజిస్టర్ కాని కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో లేని విదేశీ, దేశీయ లిక్కర్,

..మిగతా 2లో



## యాదాద్రి ఆలయ స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి...

స్వర్ణ గోపురంగా రికార్డు సృష్టించింది. స్వర్ణ గోపురానికి ఆరడుగుల ఎత్తుతో సుదర్శన చక్రాన్ని రూపొందించారు. 16 కర్ణకూటములు, 16 ముఖశాలలు, నాలుగు మహా నాసికాలు, 24 కేశమూర్తి, నాలుగు తార్క్ష్య,పక్ష్య,గరుడ, సుపర్ణ మూర్తులు, నాలుగు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ మూర్తులు, ఐదు నరసింహ మూర్తులు, 8 సింగం మూర్తుల రూపాలు రూపొందించారు. విమానంపై ఉన్న నరసింహ అవతారాలు, కేశవ నారాయణ, లక్ష్మి, గరుడ మూర్తి ఆకారాలు భక్తులకు ఆధ్యాత్మిక శోభతో కనువిందు చేస్తున్నాయి.

### నానో టెక్నాలజీ.. 50 ఏళ్ల గ్యారంటీ..

మహాబలిపురంలో రాగి తొడుగులను తయారు చేసి చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీ ద్వారా స్వర్ణ కవచాలను ఆలయ గోపురానికి ఏర్పాటు చేశారు. గత ఏడాది దసరా రోజున చేపట్టిన స్వర్ణ తాపడం పనులు ప్రారంభించారు. స్వర్ణ తాపడం పనుల కోసం స్వామి వారికి హుండీల ద్వారా 1300 కిలోల వెండి, నగల రూపంలో వచ్చిన బంగారాన్ని విమాన గోపురం తయారీకి వినియోగించింది. గర్భాలయంపై 49.5 అడుగుల ఎత్తు, 10,857 చదరపు అడుగుల మేర ఉన్న విమానానికి 68 కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తి చేశారు. 50.5 అడుగులతో దేశంలోనే అత్యంత ఎత్తయిన పంచతల గోపురంగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ఆలయ గోపురానికి స్వర్ణ తాపడం లేదు. నానో టెక్నాలజీతో 24 క్యారెట్ల బంగారం తాపడంతో 50 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా పనులు చేశారు.




## ఇక కిక్కే కిక్కు..

మొదటి పేజీ తరువాయి...

బీర్ కంపెనీలకు అవకాశం లభించనుంది.. అయితే.. అనుమతులకు ముందు నాణ్యత, ప్రమాణాలపై సెల్ఫ్ సర్టిఫికేషన్ తీసుకోనుంది. ఆయా కంపెనీలు.. ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి ఆరోపణలు లేవని తెలుపుతూ దరఖాస్తుతో పాటు సెల్ఫ్ సర్టిఫికేషన్ జతపరచాలని టీజీబీసీఎల్ ప్రకటనలో తెలిపింది.

అయితే.. నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే కొత్త కంపెనీలకు అనుమతులు ఇవ్వనున్నారు. ఇదిలాఉంటే.. గతంలో తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్మకోవడానికి టీజీ బీసీఎల్అనుమతులు ఇవ్వడం జరిగింది. అనుమతులు పొందిన సోమ్ డిస్టిలరీస్ పై పలు ఆరోపణలు రావడంతో ఈ కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. సోమ్ డిస్టిలరీస్ పై వచ్చిన ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కొత్త బ్రాండ్లను నిలిపివేసిన విషయం తెలిసిందే. కొత్తగా అనుమతులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటనలు ఇవ్వాలని ప్రభుత్వం టీజీబీసీఎల్ ను ఆదేశించింది.

ఈ మేరకు బెవరీస్ కార్పోరేషన్ తెలంగాణలో టీజీబీసీఎల్ నందు రిజిస్టర్ కాని కొత్త సప్లయిర్స్ కు అనుమతులు ఇవ్వడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను పది రోజుల పాటు ఆన్‌లైన్‌లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చె అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోనున్నారు. టీజీబీసీఎల్ లో రిజిస్టర్ కాబడి, సరఫరా చేస్తున్న సప్లయిర్స్ ప్రస్తుతం ఉన్న పద్ధతుల్లోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు.. తెలంగాణ బెవరీస్ కార్పోరేషన్ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ.. కొత్త మద్యం బ్రాండ్లపై నిర్ణయం తీసుకోనున్నారు.

## అంగన్‌వాడీల్లో కొలువుల పండగ

### 14,236 పోస్టుల భర్తీకి సర్కారు ఆమోదం

### ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక..

### జిల్లాల వారీగా నోటిఫికేషన్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం):** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో పోస్టులను ప్రభుత్వం భర్తీచేయబోతోంది. అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 కలిపి 14,236 పోస్టుల భర్తీ దస్త్రంపై మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీకానున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత ఇన్ని ఉద్యోగాల భర్తీకి ప్రయత్నాలు జరగడం ఇదే తొలిసారి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందించేందుకు వీలుగా అంగన్‌వాడీ ఉపాధ్యాయ, సహాయకుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.

పదవీ విరమణ చేయనున్న వారితోనూ కలిపి రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో టీచర్‌తో పాటు హెల్పర్ తప్పనిసరి. గతంలో ఈ పోస్టులకు ఎంపికైన వారిలో పలువురు రాజీనామాలు చేయడం, ఇప్పటికే పనిచేస్తున్న వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడంతో సిబ్బంది కొరత నెలకొంది. 65 ఏళ్ల వయసు నిండిని పలువురు పదవీవిరమణ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్నవారిలో 65 ఏళ్ల వయసు దాటిన టీచర్లు 3,914 మంది ఉన్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వీరందరూ పదవీవిరమణ చేయనున్నందున ఆ పోస్టులనూ నోటిఫికేషన్లో పేర్కొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

### ఇంటర్మీడియట్ అర్హత తప్పనిసరి

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు కనీసం పదో తరగతి పాసై ఉండాలన్న నిబంధన ఉండేది. కేంద్రం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం.. టీచర్‌తో పాటు హెల్పర్లకు కనీసం ఇంటర్ పాసైన అనుభవం ఉండాలి. దీంతో ఇంటర్మీడియట్ అర్హతను తప్పనిసరి చేయనున్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా కేంద్రం పేర్కొంది.

### 567 మంది సహాయకులకు టీచర్లుగా పదోన్నతి?

కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీలో 50 శాతం.. సహాయకులకు కేటాయించాలి. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సహాయకుల్లో టీచర్లుగా పదోన్నతి పొందేందుకు చాలా మందికి విద్యార్హతలు లేవు. ఇంటర్మీడియట్ పాసైన హెల్పర్లు 567 మంది మాత్రమే ఉన్నట్లు శిశు సంక్షేమశాఖ గుర్తించింది. వారందరికీ పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి.

### మొత్తం ఖాళీలు ఇలా..

పదవీ విరమణ చేయనున్న సిబ్బంది: 3,914
టీచర్ పదోన్నతులకు అర్హులైన సహాయకులు: 567
ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులు: 1,918
ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులు: 7,837
భర్తీ చేయనున్న మొత్తం పోస్టులు: 14,236

# కేవలం 40 నిమిషాల్లోనే..



మొదటి పేజీ తరువాయి...

ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ల వరుసలో నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత దిశగా అడుగులు పడుతున్నాయని, ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత గ్రీన్ సిటీగా ప్రపంచంలోనే అద్భుత నగరాల సరసన చేరాలన్నది సీఎం సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రో రైల్ విస్తరణ ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. దాదాపు పదిహేను వేల ఎకరాలలో విస్తరించనున్న భవిష్య నగరిని కాలుష్య రహిత నగరంగా రూపొందించడంతో పాటు, దానికి అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.

మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తాం : ఎయిర్ పోర్ట్ నుండి మీర్ ఖాన్ పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీకై జరుగుతున్న సర్వే పనులను ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటనలో పరిశీలించారు. డీపీఆర్ కోసం జరుగుతున్న సర్వే పనులపై సంబంధిత అధికారులకు మెట్రో ఎండీ అనేక సూచనలు చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందని, అది ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుండి మొదలై, కొత్తగా ఏర్పాటు కాబోయే మెట్రో రైల్ డిపో పక్క నుండి ఎయిర్ పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్ పల్లి రోడ్డుమీదుగా 5 కిలోమీటర్లు మెట్రో మార్గం ముందుకు సాగుతుంది. అనంతరం పెద్ద గొల్కోండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కి చేరుతుందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అనుగుణంగా అక్కడ బహదూర్ గుడాలో ఉన్న దాదాపు 1,000 నుండి 1,500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్ గుడా, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తాం : రావిర్యాల్ ఎగ్జిట్ నుండి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్ ఖాన్ పేట్ వరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో 100 మీటర్లు (328 అడుగులు) వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు (72 అడుగులు) మెట్రో రైల్‌కి కేటాయించారన్నారు. మెట్రో రైల్‌కి కేటాయించబడిన రోడ్ మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ ఎట్ గ్రేడ్ (భూ తలంపై) మెట్రోగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విశాలమైన రోడ్ మధ్యలో అదే లెవెల్‌లో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరువైపులా మూడు లేన్ల ప్రధాన రహదారి ఉంటుందని, మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారికి ఇరువైపులా మరల రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

మార్చి నెలాఖరుకు పూర్తి : డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఓఆర్ఆర్ నిర్మిస్తున్నప్పుడు ఓఆర్ఆర్‌లో అంతర్భాగంగా భవిష్యత్‌లో నిర్మించబోయే మెట్రోకి తగినంత స్థలాన్ని కేటాయించాలన్న అప్పటి తన ప్రతిపాదనను వైఎస్ఆర్ అంగీకరించి ఓఆర్ఆర్‌లో 20 మీటర్లు మెట్రోకి కేటాయించారని ఎన్వీఎస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. అప్పట్లో అనేక మంది ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేసినా, ప్రస్తుతం ఓఆర్ఆర్, మెట్రో రెండూ కూడా కార్యరూపం దాల్చాయని అయన పేర్కొన్నారు. వీటివల్ల హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు.

## గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్



మొదటి పేజీ తరువాయి...

నల్లమల అటవీ ప్రాంతం. పర్యావరణ నిబంధనల మేరకు ఓపెన్ కాలువ తవ్వి పనులు చేయాలంటే కష్టమైన పని. అందుకే టన్నెల్ ద్వారా నీటిని తరలించాని నిర్ణయించారు. ఆయకట్టుకు సాగునీటిని మళ్లించేందుకు నిర్మిస్తున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం దేశంలోనే అతి పెద్దది. ఈ టన్నెల్ నాగర్ కర్నూలు జిల్లాలోని అమ్రాబాద్ మండలం దోమలపెంట దగ్గర మొదలై.. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి దగ్గర పూర్తవుతుంది.

శ్రీశైలం నీటిమట్టం 826 అడుగుల నుంచి నీటిని మళ్లించేలా.. నాలుగువేల క్యూసెక్కుల సామర్థ్యంతో 43.93 కిలో మీటర్ల దూరం టన్నెల్ బోరింగ్ మిషన్‌తో సొరంగం తవ్వుతున్నారు. దీనిద్వారా వచ్చిన నీటిని డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నింపాలి. శ్రీశైలం వైపు నుంచి చేపట్టిన ఇన్‌లైట్ సొరంగం 13.97 కిలోమీటర్ల తవ్వకం పని పూర్తయింది. నీళ్లు బయటకు వచ్చే ఔట్‌లెట్ వైపు నుంచి 20.4 కి.మీ. దూరం తవ్వారు. మొత్తమ్మీద మరో 9.6 కి.మీ. మేర సొరంగం ఇంకా తవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా సొరంగం 14వ కిలోమీటర్ దగ్గర ప్రమాదం జరిగింది.

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌లో భాగంగా డిండి రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని తరలించేందుకు.. 7.130 కిలోమీటర్ల మేర మరో సొరంగం కూడా చేపట్టారు. ఈ రెండో సొరంగమార్గం ఇప్పటికే తవ్వకం పూర్తయ్యింది. ఇది నల్లగొండ జిల్లా చందంపేట మండల తెల్‌దేవరపల్లి నుంచి నేరెడుగొమ్మ వరకు ఉంది. టీబీఎంతో చేపట్టిన ఈ ప్రధాన సొరంగం పనులే పూర్తి కావాల్సి ఉంది. త్వరలోనే ఇవి పూర్తవుతాయని భావిస్తున్న తరుణంలో జరిగిన ఈ ప్రమాదం.. ప్రాజెక్ట్‌ను మరింత ఆలస్యం చేస్తోంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల తాగు, సాగు నీటి అవసరాలకు కోసం నిర్మిస్తున్న %బాదీజ% టన్నెల్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాలతో రెస్క్యూ ఆపరేషన్ నాన్‌స్టాప్‌గా కొనసాగుతూనే ఉంది. నరకానికి నకలు లాంటి ఆ ప్రాంతంలో ఎనిమిదిమంది చిక్కుకుపోయారు.

## ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు

### అహ్మదాబాద్ వేదికగా కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కానుంది. గతేడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహంలో తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఇక్కడ ఏఐసీసీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 8న సీడబ్ల్యూసీ సమావేశం, ఏప్రిల్ 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ రెండు సమావేశాలకు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ కీలక భేటీ దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నేతలను ఒక చోటకు చేర్చడమే కాకుండా భాజపా ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లు, రాజ్యాంగం, దాని విలువలపై నిరంతరం జరుగుతున్న దాడిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, పార్టీ జాతీయ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నేతలు, ఇతర ప్రతినిధులు పాల్గొననున్నారు.

## టన్నెల్ ప్రమాదం.. వారి పరిస్థితి ఆశాజనకంగా లేదు: మంత్రి జూపల్లి




**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 23 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్ బీసీ సొరంగంలోకి మంత్రి జూపల్లి కృష్ణారావు వెళ్లారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో కలిసి లోకో ట్రైన్‌లో టన్నెల్ లోకి వెళ్లిన మంత్రి.. దాదాపు ఐదు గంటల పాటు సొరంగంలోనే గడిపారు. స్వయంగా సహాయక చర్యల్లో పాలు పంచుకుని తిరిగి బయటికి వచ్చారు. ప్రమాద స్థలం దగ్గర నుంచి ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో ఇంటర్ కాం ఫోన్‌లో మంత్రి జూపల్లి మాట్లాడారు. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు లోపల జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రమాదం జరిగిన తీరును క్షేత్రస్థాయిలో జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఇంజనీరింగ్, సహాయక బృందాలకు మంత్రి దిశానిర్దేశం చేశారు. బయట నుంచి ప్రమాదస్థలికి సొరంగంలో మధ్య దూరం 13.5 కి.మీ. సొరంగం నుంచి బయటకు వచ్చిన తర్వాత మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ.. 8 మంది కార్మికుల పరిస్థితి ఆశా జనకంగా లేదన్నారు. కార్మికుల ఆచూకీ లభ్యం కావడానికి మరో రెండు మూడు గంటల సమయం పడుతుందన్నారు.. "100 మిటర్లలోనే సమస్య ఉంది. నీరు, బురద ఎక్కువగా ఉంది. రాత్రి కూడా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది" అని మంత్రి పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద 33 గంటలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రమాద స్థలానికి 50 మీటర్ల చేరువకు ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెళ్లగలిగాయి. 50 మీటర్లకు మించి ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా సిబ్బంది వెళ్లలేక పోతున్నాయి. భారీగా మట్టి, బురద పేరుకోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రతికూల పరిస్థితు లను అధిగమించే ప్రయత్నంలో ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయి. ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్‌లో నేవీ సిబ్బంది కూడా పాల్గొనున్నారు. రాత్రికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు నేవీ బృందం చేరుకోనున్నారు.

## ఏఐ రంగంలో దేశం మరింత ముందుకెళ్లాలి

మొదటి పేజీ తరువాయి...

అని తెలిపారు. అంతరిక్ష రంగంపై యువత కూడా ఆసక్తి చూపుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడం అనేది ఇటీవల సాధించిన విజయాల్లో ఒకటన్నారు."ఇటీవల ఏఐ సదస్సులో పాల్గొనేందుకు పారిస్‌కు వెళ్లాను. కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించింది. తాజాగా తెలంగాణ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో మాకు సాయం చేశారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారు" అని మోదీ అన్నారు. అంతరిక్షం లేదా ఏఐ అయినా భాగస్వామ్యం పెరుగుతోందని ప్రధాని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికే అంకితం చేస్తామన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగం రూపకల్పనలో మహిళల పాత్ర గురించి ఆయన కొనియాడారు.

# విలువలతో కూడిన విద్యను అందించే గొప్ప పాఠశాలలే శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు




విద్యారణ్య ఆవాస విద్యాలయం వార్షికోత్సవం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ వర్మ



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు

## తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (బండ్లగూడ), ఫిబ్రవరి 23: విలువలతో కూడిన విద్యను అందిస్తూ జాతి నిర్మాణంలో పాలు పంచుకునే పౌరులను శ్రీ సరస్వతి శిశుమందిర్ లు తయారు చేస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. ఇతర విద్యాసంస్థలు చదువు చెప్పడానికి మాత్రమే పరిమితం అవుతాయని,, కానీ విద్యా భారతి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు అసలు సిసలు భారతీయత ను బోధిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని (హైదరాబాద్) బండ్లగూడ జాగీర్ లోని శారదాధామం ప్రాంగణంలో నెలకొని ఉన్న శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం వార్షికోత్సవం కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల అధ్యక్షులు అర్జున్ గౌడ్, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ తిరుపతిరావు, రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ ఆయనకు స్వాగతం పలికారు. మొదటగా ప్రాంగణంలోని శ్రీ సరస్వతి ఆలయాన్ని గవర్నర్ సందర్శించారు. అనంతరం విద్యాలయం ప్రాంగణంలో వార్షికోత్సవం కార్యక్రమాన్ని వీక్షించి గవర్నర్ తమ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో విద్యాలయాలు కెరీర్ కు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ డాక్టర్లు ఇంజనీర్లను తయారు చేసేందుకు పోటీ పడుతున్నాయని జిష్ణు దేవ్ వర్మ వివరించారు. కానీ విద్యా భారతి సరస్వతీ విద్యాపీఠం పాఠశాలలను తాను గమనిస్తున్నానని, , ఈ విద్యాలయాలలో అచ్చంగా సంస్కృతి సాంప్రదాయాలతో పాటు భారతీయతను నేర్పిస్తున్నారని,, ఒక్క మాటలో చెప్పాలంటే అసలు సిసలు భారతీయ పౌరులను ఇక్కడ తీర్చిదిద్దుతున్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సుస్పష్టంగా తెలియ చేశారు. భగవద్గీతలో చదువు విలువను చక్కగా వివరించారని జిష్ణు దేవ వర్మ వివరించారు. ధర్మం కర్తవ్యం నైతికత వంటి విలువలతో కూడినదే అసలైన విద్య అని ఆయన స్పష్టంగా తెలియజేశారు. అదే స్ఫూర్తితో విద్యా భారతి , ముఖ్యంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం శిశు మందిర్ స్కూల్స్ విద్యార్థుల సమగ్ర వికాసం కోసం కృషి చేస్తున్నాయని, అంతిమంగా విలువలతో కూడిన పౌరులను సమాజానికి అందిస్తున్నాయని కొనియాడారు. పుస్తకాల చదివితే సమాచారం మాత్రమే అందుతుందని, కానీ ఈ విద్యాలయాలు భావితరం నాయకులను తయారు చేస్తున్నయని, భారత సమాజం వికాసం కోసం కృషి చేస్తున్నాయిని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలోని పిల్లల నడవడిక, ఆచార్యుల ఆత్మీయ శిక్షణ, నాయకత్వం అందిస్తున్న ఆహ్లాదకరమైన వాతావరణం చూసి గవర్నర్ జిష్ణుదేవ వర్మ పులకించి పోయారు. ఆశువుగా సర్వ మంగళ మాంగల్యే ..అంటూ అనేక శ్లోకాల్ని ఆయన చదివి వినిపించారు. రూపం దేహి అంటే అంటే చక్కటి పౌరులు, జయం దేహి అంటే జాతి నిర్మాణంలో విజయం, యశోదేహి అంటే విశ్వ గురువుగా భారత్ కు కీర్తి ప్రతిష్టలు, ద్విషో జహి అంటే చీకట్లో తొలగిస్తూ దేశం ముందుకు సాగాలని, ఇందులో విద్యార్థులు యువత ముఖ్యపాత్ర పోషించాలని ఆయన అభిలషించారు. ప్రస్తుత భారతీయ సమాజం పెద్ద సంఖ్యలో యువతను నడిపించే పటిష్టమైన నాయకత్వాన్ని కలిగి ఉందని,, ఇది చరిత్రలో అరుదైన ఘట్టం అని ఆయన వివరించారు. శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం విద్యార్థులకు ఆచార్యులకు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ గవర్నర్ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, భాగ్యనగర్ విభాగ కార్యదర్శి రవీందర్ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, కార్యవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




పగిడిమర్రి సూర్యనారాయణ దంపతులను కలసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, రాజేంద్రనగర్ సర్కిల్ పాత్రికేయులు మేకల దామోదర్ రెడ్డి తదితరులు

## ఘనంగా పగిడిమర్రి సూర్యనారాయణ-ఉమా దేవిల 25వ వివాహా వార్షికోత్సవ వేడుక

### హాజరైనా జర్నలిస్టులు, స్నేహితులు, బందువులు

బుద్వేల్, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మార్కండేయ నగర్ వాస్తవ్యులు, రాజేంద్రనగర్ మండల జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి పగిడిమర్రి సూర్యనారాయణ 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం మార్కండేయ నగర్ లోని ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు ఈ వేడుకలలో పాల్గొని పగిడిమర్రి సూర్యనారాయణ-ఉమాదేవి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురు కలకాలం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని తెలిపారు. సూర్యనారాయణ-ఉమాదేవిల పిల్లలు పి.సౌమ్య, పి. ప్రవీణ్ లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివాహ వార్షికోత్సవ వేడుకల్లో సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, రాజేంద్రనగర్ మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు మేకల దామోదర్ రెడ్డి , ఉపాధ్యక్షులు వర్కాల చందు లతోపాటు జర్నలిస్ట్ సంఘం నాయకులు గద్దె యాదగిరి , ఎం ప్రేమ్ రాజ్, పి సూర్యకిరణ్, బి బాబు రావు, ఎం బాల సుబ్రమణ్యం, కోరని మహేష్ లతోపాటు ఎ .భీమయ్య, మాధవి, నాయకులు ఎర్వ సత్యనారాయణ, యు నిరంజన్, బొల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గోన్నారు.



సూర్యనారాయణ-ఉమాదేవిలకు పెళ్ళి రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న పాత్రికేయులు ఎ.భీమయ్య - మాధవితో పాటు టీవీ9 రిపోర్టర్ ఎం బాలసుబ్రమణ్యంలు

## తాళం వేసిన ఇంట్లో చోరీ

బుద్వేల్, ఫిబ్రవరి23(ప్రభాత ఉదయం): తాళం వేసిన ఇంట్లో కి చొరబడ్డ ఓ వ్యక్తి దొం గతనానికి పాల్పడుతుండగా క్రింద పోర్టన్‌లో అద్దెకు ఉండేవారు అరవడంతో ఆ దొంగ పారి పోయాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. కిస్మత్పూర్ లో మెరుగు జంగయ్య గౌడ్ కుటుం బం నివాసం ఉంటుంది. పై అంతస్థులో వారు ఉంటుండుగా, క్రింద పోర్షన్ ను అద్దెకు ఇచ్చారు. ఆయన కొడుకు రామక్రిష్ణగౌడ్ ఓ జడ్జీ వద్ద డ్రైవర్ గా పనిచేస్తుండగా, కోడలు హేమవతి బండ్లగూడ ఖాళీమందిర్ లో ఉండే లాయర్ దగ్గర ప్రాక్టీస్ చేస్తుంది. శనివారం బందువుల ఇంట్లో పెళ్లి ఉండగా మెరుగు జంగయ్య గౌడ్ కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లారు. జంగయ్య గౌడ్ తో పాటు మనుమళ్లు పెళ్లి వద్దనే ఉన్నారు. రామక్రిష్ణగౌడ్, హేమావతి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి రాత్రి పడుకుని ఉదయం లేచి వారి వారి డ్యూటీలకు వెళ్లారు. అదివారం మద్యాహ్నం సమయంలో గుర్తు తెలియని ఓ యువకుడు తాళం వేసిన పై అం తస్తులోకి వెళ్లి తలపు తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లాడు. కత్తితో బీరువా తాళం తెరచి లోపల దాచి ఉంచిన రూ. 3వేలు తీసుకున్నాడు. ఇంతలోనే క్రింద పోర్షన్ లో ఉన్న వారు దొంగ దొంగ అని అరవడంతో దొంగతనానికి వచ్చిన వ్యక్తి విని అక్కడినుంచి పారిపోయాడు. అతడు పారి పోతున్నప్పుడు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలలో పడింది. విషయాన్ని తెలుసుకున్న హేమావతి ఇంటికి వచ్చి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంధువుల ఇంట్లో పెళ్లి ఉందని బం గారం తీసుకువెళ్లి అక్కడ పెట్టామని లేకుంటే అది కూడా పోయేదని వాపోయారు. తాము డ్యూటీకి వెళతామని, పిల్లలు ఇద్దరే ఇంట్లో ఉంటారని, పట్టపగలే దొంగ వచ్చి చోరికి ప్రయత్నిం చడం చూస్తే భయమేస్తుందన్నారు. దొంగను పట్టుకుని తనకు న్యాయం చేయాలన్నారు.




శ్రీ గాయత్రి టెక్నో స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్యపై బోధనలు జరగాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### ఘనంగా శ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం) ప్రస్తుత సాంకేతిక యుగంలో విలువలు అంతరించిపోతున్నాయని అందు కోసం విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు.ఆదివారం కాటేదాన్ లోని అమ్మ గార్డెన్ లోశ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ దినోత్సవాలు ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచేయగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... విద్యారంగంలో గత పన్నెండు సంవత్సరాలుగా శ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాల అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో విద్యార్థులను మణులుగా ఆర్చి దిద్దగలిగారని కొనియాడారు. గాయత్రి పాఠశాలలో) చదివిన విద్యార్థులు సమాజంలో మంచి మార్పులకై పాటు పడాలని దీని స్తూ, ఈ ప్రయణ ఇలాగే ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "స్త్రీ గాయత్రి పాఠశాల చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలలో ఉన్నారని అభినందించారు. క్రమశిక్షణకు పెద్ద పేద వేస్తున్నారని కొనియాడు రోజులలో ఈ విద్యా సంస్థ నుండి విదార్థులు డాక్టర్లు. ఇంజనీర్లు - బాయర్లు గా "ఎదగాలని ఆకాంక్షించారు!

అకాడమిక్ కో- ఆర్డినేటర్ నిరంజన్ శాస్త్రి మాట్లాడు-తూ... "విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు కలిగి విద్యను అభ్యసిం చాలని, చురుకుగా అన్ని రంగాలలో ఎదగాలని కోరుకున్నారు"""


ఈ ఉత్సవాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు చేసిన నృత్య ప్రదర్శన, విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృ -తిక్ వృత్యం, విద్యార్థులు ప్రదర్శించిన హను మంతుని నృత్య ప్రదర్శన తో పాటు 5 సంవత్సరాలు %ఖఖ+% సచదువుతున్న ఆరాద్య తడబాటు లేకుండా తక్కువ సమయంలోనే హనుమాన్ చాలీసా పూర్తి చేయడం.. ప్రముఖులతో పాటు, అందరిని ఆకట్టు కుంది."ఈ కార్యక్రమంలో పాఠశాల చెర్మెన్. కె మధుసూదన్ , డైరెక్టర్లు సమయుద్దీన్ , శ్రీహరి - , సీఈవో సర్వేశ్వర్ రావు , అకాడమిక్ కో- ఆర్డినేటర్ నిరంజన్ శాస్త్రి ల తో పాటు పలువురు హజరై విద్యార్థులను అభినందించి, ఆశీర్వదించారు.



పూజలలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## శివ పార్వతుల కళ్యాణం

బుద్వేల్, ఫిబ్రవరి23 (ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురం శివాలయం లో ఆదివారం శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. పద్మశాలిపురం లో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. పూజా కార్యక్రమాలలో ఎల్వీ రెడ్డి, మహిపాల్, భూపతిరెడ్డి, తలారి చిన్న, బుగ్గయ్య, గురుస్వామీ, రమేశ్, అవినాశ్, శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

బండ్లగూడ, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. రిసెప్షన్ పరిధిలో డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మీ చల్ కాలనీ, వినాయక్ నగర్, డీడీ కాలనీ, కాళీ మందిర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్, బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల వరకు ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, ఖాలీకా నగర్, ఎన్ఎఫ్సీ కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1, 5, న్యూ కేర్ హాస్పిటల్, గాయత్రి నగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, షిరిడి సాయిబాబా కాలనీ, ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్, భారతి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# ద్రాక్ష మేళాలో సంతోషంగా పాల్గొంటున్న ప్రజలు

### ఈ అనుభూతి మరెక్కడా దొరకదంటున్న సందర్శకులు.. కొనుగోలుదారులతో సందడిగా మారిన ద్రాక్ష తోట

బుద్వేల్, ఫిబ్రవరి23 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ద్రాక్ష పరిశోధనా కేం ద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ద్రాక్ష మేళా కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంది. ఆదివారం కావడంతో ద్రాక్ష పండ్లను కొనుగోలు చేయడానికి కుటుంబ సభ్యులతో కలసి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. ద్రాక్ష పండ్లను చెట్లపైనే రుచి చూసి తమకు నచ్చిన పండ్లను కొనుగోలు చేసే అవకాశం ఉన్నందున రాజేంద్రనగర్ పరిసర బస్తీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ద్రాక్ష తోటకు తరలివచ్చారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల కు చెందిన ద్రాక్ష పరిశోధనా స్థానంలో 53 రకాల ద్రాక్షలను పండించారు. వాటికి వేలం వేయడంతో వేలంలో తీసుకున్న మంగళారం కార్తీక్ ఆధ్వర్యంలో మేళా ను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.



చిన్నారితో ద్రాక్ష తోటకు వచ్చిన ఓ మహిళ



ద్రాక్షలను కోస్తూ....



ద్రాక్ష తోటలో ద్రాక్ష పండ్లను ఆస్వాదిస్తూ .....



ద్రాక్ష పండ్లతో మహిళ



ఆనందంతో....




# కొత్తకోట విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ అందించిన సినీ హీరో సుమన్ తల్వార్

కొత్తకోట, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం): హైదరాబాద్ ఎల్ బి నగర్.నారాయణ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో కొత్తకోట చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ లు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా ఎం.విజయ్ కుమార్ కే.దుర్గాప్రసాద్ చారి. రాచాల తరుణ్ ,ఎన్ సాయి దివేశ్,సత్య సింహ, ల కు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లును అందజేశారని. వీరికి శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్ ఎండి ఇంతియాజ్ ను ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని అని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు.ఈ కార్యక్రమంలో సదాశివం, సీనియర్ కరాటే మాస్టర్.సయ్యద్ అశ్వక్ ,రఫీ ఖాద్రి,వెంకటేష్, జి హరీష్ యాదవ్,జాఫర్ సాదిక్, లు పాల్గొన్నారు.



# స్వంత డబ్బులతో మల్లన్న దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేసిన ఇచ్చిన మాట నిలుపుకున్న కస్తూరి నరేందర్

శంషాబాద్, ఫిబ్రవరి 23( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని చౌదరిగుడ శివార్లలో ఉన్న మల్లన్న గుట్టకు ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసి దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మనికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ తన సొంత డబ్బులు ఏడు లక్షల రూపాయలు వెచ్చించి విద్యుత్ సరఫరా చేపట్టారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకు మల్లన్న దేవాలయానికి విద్యుత్తు సరఫరాను ఏర్పాటు చేయడం కోసం ప్రత్యేకంగా ట్రాన్స్ఫార్మర్ బిగించడంతోపాటు 14 స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఆదివారం నిర్వహించిన మల్లన్న జాతర సందర్భంగా నరేందర్ స్వయంగా వీటిని ప్రారంభించారు. ఏడు లక్షల రూపాయల సొంత నిధులతో వీటిని ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించినందుకు ఆలయ కమిటీతో పాటు భక్తులు ఆయనను శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్. మాజీ ఉప సర్పంచ్ సురేష్ నాయక్. కోటేశ్వర్ గౌడ్. ప్రభాకర్ యాదవ్. రవి నాయక్. కే లక్ష్మణ్. బిక్షపతి. లింగం. దేవేందర్. మహేష్. అంజి. కుమార్ యాదవ్. మల్లేష్. లక్ష్మణ్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



# శుభకార్యాలలో పాల్గొన్న నాయకులు

పెబ్బేర్, ఫిబ్రవరి 23(ప్రభాత ఉదయం) పెబ్బేరు పట్టణంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి గృహప్రవేశం కార్యక్రమంలో నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ,డిసిసిబి డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి, కొత్తకోట మండల సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, మాజీ చైర్మన్ సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి ,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేరు సింగల్ విండో అధ్యక్షుడు గౌని కోదండరాంరెడ్డి, ,గుడిబండ మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, మిరాశి పల్లి మాజీ సర్పంచ్ సాయి రెడ్డి , నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డి , మూలమల్ల జైపాల్ రెడ్డి, కృష్ణ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు . అదేవిధంగా కొత్తకోట పట్టణంలో ఆనంద్ కన్వెన్షన్ హాల్లో పండ్ల బండి నారాయణ కుమారుని వివాహానికి హాజరై నవ వధూవరులను ఆశీర్వదించిన వనపర్తి రోడ్డు మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి మాజీ సింగల్ విండో డైరెక్టర్ మూలమల్ల చక్రవర్దన్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



పెబ్బేరులో కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి గృహప్రవేశంలో పాల్గొన్న నాయకులు..



బండి నారాయణ కుమారుడు వివాహోత్సవంలో పాల్గొన్న నాయకులు

# ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా అతిషి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం):** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకురాలు, మాజీ సీఎం అతిషి ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. ఆప్ శాసనసభా పక్ష సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా ఒక మహిళ ఎంపిక కావడం ఇదే తొలిసారి. ఆదివారం ఆప్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. 22 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకురాలిగా అతిషి పేరును ఎమ్మెల్యే సంజీవ్ ఝా ప్రతిపాదించారు. ఢిల్లీ సీఎం రేఖ గుప్తాను ఎదుర్కోవడానికి బలమైన మహిళా నేతగా అతిషిని పేర్కొన్నారు. దీంతో ఆప్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమెను ఎన్నుకున్నారు.కాగా, ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా తనను ఎన్నుకోవడం పట్ల అతిషి హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచినందుకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పార్టీ ఎమ్మెల్యేకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. 'బలమైన ప్రతిపక్షం ప్రజల గొంతును లేవనెత్తుతుంది. బీజేపీ ఇచ్చిన అన్ని వాగ్దానాలు నెరవేర్చేలా ఆప్ ప్రయత్నిస్తుంది' అని అన్నారు.
మరోవైపు ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరిగాయి. 48 స్థానాలను గెలుచుకున్న బీజేపీ దేశ రాజధానిలో తిరిగి అధికారంలోకి వచ్చింది. ఆప్ 22 సీట్లలో విజయం సాధించగా కాంగ్రెస్ ఒక్క స్థానంలో కూడా గెలువలేకపోయింది. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి.






# సంపద సృష్టికర్తలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఏది

## సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వంగూరు రాములు


గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి23(ప్రభాత ఉదయం)సంపద సృష్టికర్తలైన కార్మికులకు బడ్జెట్లో ప్రాధాన్యం ఏదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వంగూరు రాములు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బడ్జెట్ పై ఏర్పాటు చేసిన జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రత్యక్ష పన్నులు పెంచి పరోక్ష పన్నులు తగ్గించి కార్మికులను న్యాయం చేయకుండా,పెట్టుబడి దారుల సంపద పై పన్నును తగ్గించడమేమిటని ప్రశ్నించారు సంపద సృష్టికర్తలైన కార్మిక వర్గం 58 కోట్ల మంది ఉన్నారని,50 లక్షల కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్ లో కేవలం రూ.3600 కోట్లు మాత్రమే కార్మిక శాఖకు కేటాయించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. కార్మిక వర్గానికి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించడం వల్ల దేశం అన్ని రంగాలలో అగ్రగామిగా ముందుకు వెళ్తుందని కానీ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం గురించి కాకుండా అంబానీలు ఆదానిలపై ఆధారపడి బడ్జెట్ ను ప్రవేశపెట్టారని విమర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధిని కల్పించే చర్యలు బడ్జెట్ లో ఏమాత్రం లేవని విమర్శించారు గత బడ్జెట్లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.86 వేల కోట్ల కేటాయించగా ప్రస్తుత బడ్జెట్లో రూ.3000 కోట్లు తగ్గించారని అన్నారు. ఉపాధి హామీ అంటే బిజెపి దృష్టిలో ఆదాని అంబానీ లాంటి కార్పొరేటర్లకు ఉపాధి కల్పించడమేనా అని ప్రశ్నించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి న్యాయస్థానాలు వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులకు గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం 13 లక్షల కోట్ల రూపాయలు మాఫీ ఎందుకు చేశారని ప్రశ్నించారు పెట్టుబడిదారులకు ఇస్తే రాయితీలు పేదలకు ఇస్తే దేశానికి భారం ఎలా అవుతుందని అన్నారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక వ్యతిరేక బడ్జెట్ ను కార్మిక వర్గం అర్థం చేసుకొని కేంద్రం బడ్జెట్ ను సవరించేంత వరకు జరిగే పోరాటాలలో కార్మిక వర్గం భాగస్వాములై ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రాజు అంగన్వాడి సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏమేలమ్మ %ఋూూ% సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి గ్రామ పంచాయితీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ , మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంజీవ రాజు, రైతు సంఘం నాయకులు మంచాల నరసింహ, హమాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, కార్మికులు విష్ణు, రఘు, తిరుపతి, నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామీ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు





అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్.. తోకల శ్రీనివాస్ రెడ్డి



దర్శనం చేసుకున్న సీఎం తమ్ముడు ఎ కృష్ణా రెడ్డి ..



పూజలలో పాల్గొన్న సామ భూపాల్ రెడ్డి, తదితరులు

బుద్వేల్, ఫిబ్రవరి23(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి బస్తీలో ఆదివారం శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జనిగాయి. శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప, శ్రీ వీరాంజనేయ భక్త సమాజం, బస్తీ ప్రజల ఆద్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. . ఈ నెల 21న ప్రారంభమైన పూజలలో ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు . ఆదివారం ఉదయం 4గంటలకు గణపతి పూజలతో పూజా కార్యక్రమాలు మొదలైనాయి. దేవాలయ ప్రాంగణంలో శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయంతో పాటు శ్రీ గణపతి, సుబ్రమణ్య స్వామీ, శివ పంచాయతన, ద్వాదశ జ్యోతిర్లింగ, సంతోషి మాత, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ చేశారు. పూజా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి , ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోదరుడు ఎ.క్రిష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాలరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608